ఈ మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు

- భయాందోళనలు కలిగిస్తున్న ఫార్మాసిటీ కాలనీ రహదారి
- రోడ్డు విస్తరణే సమస్యకు పరిష్కారమంటున్న స్థానికులు, వాహన చోదకులు



ఇమ్రిపాలెం, ఫార్మాసిటీ కాలనీల రహదారి మలుపు

అగనంపూడి: ఓ పక్క ఇరుకు.. మరో పక్క మలుపులు.. తరచూ ప్రమాదాలతో ఈ మార్గంలో ప్రయాణం అంటే ప్రయాణికులు హడలిపోతున్నారు. జాతీయ రహదారి ఏడుమెట్ల మద్రిపాలెం బస్టాప్ నుంచి హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి మీదుగా రాకపోకలు సాగించే ఇరుకు రహదారిలో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటుండడంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ రహదారి మీదుగా ఏడుమెట్ల మద్రిపాలెం, గొన్నవానిపాలెంతో పాటు 7 ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీలకు చెందిన వేలాది మంది నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. అంతే కాకుండా గాజువాక, అనకాపల్లి, ఉక్కునగరం, కూర్మన్నపాలెంలోని ప్రైవేటు కళాశాలలు, పాఠశాలలకు చెందిన అనేక బస్సులు కూడా ఈ మార్గంలో వచ్చి పోతున్నాయి. హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి ఇన్‌గేటు, ఔట్ గేటుకు మధ్యలో రహదారి కుదించుకుపోయి ఉండడం, దారి మలుపులు తిరిగి ఉండడంతో భారీ వాహనాలు వచ్చే సమయంలో ద్విచక్ర వాహన చోదకులు రహదారి అంచుల్లోకి వెళ్లాల్సి వస్తోంది. ఆదమరిచి ప్రయాణిస్తే ప్రమాదాల బారిన పడుతున్నారు. నెల రోజుల క్రితం ఈ మార్గంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరు దుర్మరణం పొందగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. 8 సంవత్సరాల క్రితం రహదారి విస్తరించడానికి జీవీఎంసీ ప్రతిపాదనలు చేయడం, తరువాత పక్కన పెట్టడంతో ఈ మలుపుల రహదారిలో ప్రయాణం అంటే ప్రతి ఒక్కరు హడలిపోయే పరిస్థితి ఏర్పడింది. రాత్రి వేళల్లో ఈ ప్రాంతంలో వీధి దీపాలు లేకపోవడం వల్ల కూడా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. భారీ వాహనాలు వచ్చేటప్పుడు ద్విచక్రవాహనాలు పక్కకు తప్పుకోడానికి వీలు లేకుండా రెండు వైపులా ఆరు అడుగుల లోతు ఉండడంతో ఈ ఇబ్బందులు తప్పడం లేదు. క్యాన్సర్ ఆస్పత్రికి వందలాది వాహనాల్లో రోగులు ఇక్కడికి వస్తున్నారు. వీరు ఔట్ గేటు నుంచి మలుపుల రహదారిలోనే వెళ్లాల్సి వస్తుండడంతో మరింత ఇబ్బందిగా మారింది. జీవీఎంసీ, క్యాన్సర్ ఆస్పత్రి సంయుక్తంగా రహదారి విస్తరణ చేపట్టి వాహనాల రాకపోలకు ఇబ్బంది లేకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి..

మలుపుల రోడ్డులో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. నివారణకు చర్యలు చేపట్టాలి. రహదారిని విస్తరించాలి. వీధి దీపాలు ఏర్పాటు చేసి వేగ నియంత్రణ చర్యలు తీసుకోవాలి.

అప్పలరాజు, ఫార్మాసిటీ కాలనీ.

రహదారి విస్తరణే మార్గం..

రహదారిని రెండు వైపులా విస్తరించాలి. ఇరుగ్గా ఉన్న రోడ్డులో వేలాది వాహనాలు ప్రయాణం చేస్తున్నాయి. దువ్వాడ, సబ్బవరం శివారు ప్రాంతాలకు ఈ మార్గం సమీపం కావడంతో రద్దీగా మారింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని రోడ్డును విస్తరించాలి.

అప్పారావు, ఇ.మద్రిపాలెం.

కమ్యూనిటీ హాల్ ప్రారంభం



కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని చినకోరాడ గ్రామంలో కొత్తగా నిర్మించిన సామాజిక భవనాన్ని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 40శాతం వరకూ పనులు మాత్రమే చేశారని చెప్పారు. ఇప్పుడు రూ.10 లక్షలతో ఆ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చామన్నారు. గత నాలుగేళ్లలో 75వ వార్డులో రూ.8 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీభాయి, నాయకులు మార్డు పూడి పరదేశి, గొందేశి వెంకట రమణారెడ్డి, పులి వెంకటరమణారెడ్డి, గంట్యాడ గురుమూర్తి, కొయ్య భారతి, వెంకటేష్, పెద్దిరెడ్డి, పెద్దాడ కనకరాజు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం



యాగంలో పాల్గొన్న భక్తులు, అసోసియేషన్ నాయకులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్-5లోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. వైశాఖ శుద్ధ దశమి రోజున జీవ సమాధి పొంది 300 ఏళ్ల పూర్తయిన సందర్భంగా స్టీల్‌ప్లాంట్ విశ్వబ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఇస్పాత్ కొలుములకు మూలాధారం అయిన టువంటి విశ్వకర్మ, జగద్గురు ఆదిశంకరాచార్యుల వారికి మహాయజ్ఞ యాగం నిర్వహించారు. అధికారులు, కార్మిక వర్గం, పరిసర గ్రామాల ప్రజలు అందరూ క్షేమంగా ఆయురారోగ్యాలతో నిండుగా జీవించాలని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.శ్రీనివాసన్, కె.ఉమామహేశ్వరరావు, ఎం.శ్రీనివాస్, ఎం.అనిల్, జి.మధు, నాగ మల్లేశ్వరరావు పాల్గొన్నారు

పెదగంట్యాడలో..

పెదగంట్యాడ : జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని పెదగంట్యాడలో గల వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆరాధనోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, నిర్వాసితుల సంఘం నాయకుడు పులి వెంకటరమణారెడ్డి పాల్గొని వీరబ్రహ్మేంద్రస్వామి వారి విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ ముద్దర్తి శ్రీరామ్మూర్తి, కణితి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీలను విస్మరించిన కేంద్రం



808వ రోజు ఉక్కుదీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం : విభజన హామీలు విస్మరించి రాష్ట్రంలో అతిపెద్ద పరిశ్రమగా ఎదిగిన విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు ప్రయత్నించడం అన్యాయమని పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలి జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు 808వ రోజుకు చేరుకున్న నేపథ్యంలో వైఎస్సార్‌టీయూసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ప్రభుత్వరంగ పరిశ్రమల్ని సర్వనాశనం చేయడానికి కేంద్ర ప్రభుత్వం చూస్తుందన్నారు. ఈ ప్రయత్నాలను సంస్థలోని కార్మికులందరు ఐక్యంగా ఎదుర్కోవాలన్నారు. దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైన ఉందన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వ పెద్దలు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హెల్మెట్ ధారణపై అవగాహన



హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీస్

పెదగంట్యాడ: వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని న్యూపోర్టు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ పెద్దాడ రాజు కోరారు. పెదగంట్యాడ జంక్షన్‌లో వాహనచోదకులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గత ఏడాది హెల్మెట్ ధరించకపోవడంతో 147 మంది మృత్యువాత పడ్డారని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. హెల్మెట్ ధరిస్తే ప్రమాద సమయంలో ప్రాణాపాయం ఉండదన్నారు. రోడ్డు ప్రమాదల్లో ఎక్కువ మంది హెల్మెట్ ధరించకపోవడంతోనే మృతి చెందుతున్నారని చెప్పారు. అనంతరం ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

5న బుద్ధ జయంతి సభ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: ఈ నెల 5న బుద్ధపూర్ణిమను పురస్కరించుకుని బుద్ధ జయంతిని నిర్వహించనున్నామని బర్మా ఆంధ్ర బౌద్ధ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బోర వేణుగోపాల్ గౌతమ్ తెలిపారు. ఈ మేరకు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి స్వగృహంలో ఆదివారం కరపత్రాలను ఆవిష్కరించారు. జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని బర్మా కాలనీలో పెద్ద ఎత్తున సభ నిర్వహించనున్నామని గౌతమ్ తెలిపారు. ఈ మేరకు బౌద్ధ పతాకాన్ని ఆవిష్కరించనున్నామన్నారు.

బార్ అసోసియేషన్ క్రీడా కార్యదర్శిగా ఈశ్వరరావు



అగనంపూడి: అనకాపల్లి జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికల్లో 79వ వార్డు లంకెలపాలేనికి చెందిన సీనియర్ న్యాయవాది, వైఎస్సార్‌సీపీ పెందుర్తి నియోకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు కింతాడ ఈశ్వరరావు స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆయనను 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇల్లపు ప్రసాద్, 79, 85 వార్డుల వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందించారు

అనాథ బాలలకు నిత్యావసరాల పంపిణీ



మంత్రి కృష్ణారావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి రాజశేఖర్

పెదగంట్యాడ: మంత్రి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో జనరేషన్ యువ వెల్ఫేర్ సొసైటీకి చెందిన అనాథ బాలలకు ఆదివారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. మంత్రి కృష్ణారావు తృతీయ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రి శంకర నారాయణ, మంత్రి గోపీ, మంత్రి నర్సింహమూర్తి, రామచంద్రరావు, నగేష్, పల్లం గోపీ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ బాక్సర్లకు పౌష్టికాహారం పంపిణీ

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడా కాలనీలోని వాకింగ్ పార్కులో పలువురు జూనియర్ బాక్సర్లకు ఆదివారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. మైక్ టైసన్ బాక్సింగ్ క్లబ్ నిర్వాహకుల ఆధ్వర్యంలో క్లబ్ ప్రతినిధులు మజ్జి రమేష్ పాత్రుడు, షేక్ ఆలీ, గణేష్, హరి, సాయి, ప్రసాద్ తదితరులు ఫుడ్ అందించారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌కు సత్కారం



పూర్ణను సత్కరిస్తున్న అగనంపూడికి చెందిన ప్రజా సంఘాల నేతలు

అగనంపూడి: రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన అగనంపూడికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జి.పూర్ణానందశర్మ (పూర్ణ)ను అగనంపూడికి చెందిన ప్రజా సంఘాలు ఘనంగా సత్కరించాయి. ఈ సందర్భంగా సర్వహిత చారిటబుల్ వ్యవస్థాపకుడు, ఉక్కు విశ్రాంత అధికారి గుడే సుశీలా గజేంద్రరావు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి పూర్ణ కష్టపడి పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేశారన్నారు. సామాజిక స్పృహ ఉన్న నాయకుడుకి ఇటువంటి పదవి దక్కడం సంతోషంగా ఉందన్నారు. పూర్ణ మాట్లాడుతూ మే నెల ఒకటవ తేదీన అమరావతిలో కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించేందుకు ఆహ్వానం అందిందన్నారు. తన వెన్నంటి ఉన్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజా సంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తా రామారావు, సురేష్, కొయ్య రాంబాబు, పెదిరెడ్ల హరీష్, విందుల వరప్రసాద్, పట్ట రామకృష్ణ, తులసి, నారాయణరావు, కొల్లి దేముడు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అక్కిరెడ్డిపాలెం: 132 కేవీ నేవల్ టవర్ మరమ్మతుల దృష్ట్యా 11 కేవీ మింది ఫీడర్, గాజువాక ఫీడర్, 33 /11 కేవీ బీహెచ్‌పీవీ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్-2 ఈఈ బీకే నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మింది, మింది ఇండస్ట్రియల్ ఏరియా ఎ-బ్లాక్, రాంనగర్, గిరిప్రసాద్ కాలనీ, రాంనగర్ బీఎస్ఎన్ఎల్ ఎక్స్‌చేంజ్, మింది రాజీవ్‌నగర్, గుడివాడ అప్పన్నకాలనీ, కాళికానగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

ఘనంగా కన్యకా పరమేశ్వరి జయంతి



కన్యకా పరమేశ్వరి ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని హౌసింగ్ బోర్డు సమీపంలో గల కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వాసవీ క్లబ్ వైజాగ్ స్టీల్ పెదగంట్యాడ ఆధ్వర్యంలో అమ్మవారిని బంగారం, వెండి ఆభరణాలతో అలంకరించారు. అనంతరం పంచామృతాభిషేకం చేశారు. అలాగే 102 మంది మహిళలతో సామూహిక కుంకుమార్చనలు జరిపించారు. ఈ కార్యక్రమానికి చైర్మన్లగా శిరం రామారావు, నాగమళ్ల శ్రీనివాస్, పచ్చిగోళ్ల భోగలింగస్వామి, చిట్టూరి వెంకటేశ్వరరావు వ్యవహరించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎం.త్రిమూర్తులు, గౌరవాధ్యక్షుడు కొల్లా అప్పలరాజు, ముమ్మిడిశెట్టి ముత్యాలశెట్టి, బొండాడ వెంకటేశ్వరరావు, పెరుమాళ్ల వెంకటేశ్వర్లు, చెరుకూరి నర్సింహమూర్తి, వీఆర్‌పీఎస్ కుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శాంతి హోమం

పెదగంట్యాడ: యువ హిందూ సాంస్కృతిక సంఘ్ ఆధ్వర్యంలో 76వ వార్డు పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో సూర్యనారాయణస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా ఆదివారం శాంతి హోమం నిర్వహించారు. అలాగే బలిపీఠం ఆరాధన, పాలదివాస్, అన్నాదివాస్, అరణిమందన్, అగ్నిప్రకత్య, హవన్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ నామస్మరణతో హోరెత్తించారు. పండిట్ విజయశంకర్ చతుర్వేది పర్యవేక్షణలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 3న సూర్యనారాయణమూర్తి విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వేడుకగా శ్రీ బాల త్రిపుర సుందరీదేవి ఆలయ వార్షికోత్సవం



అమ్మవారికి కుంకుమ పూజ చేస్తున్న దృశ్యం

అక్కిరెడ్డిపాలెం: శ్రీ బాల త్రిపుర సుందరి అమ్మవారి వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పంతులుగారి మేడ ఎదురు రోడ్డులో వేంచేసిన శ్రీ బాల త్రిపుర సుందరీ దుర్గా ఆత్మలింగ శ్రీ మేరు సహిత పంచప్రాణేశ్వర మహాశక్తి పీఠంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. 150 మంది స్త్రీలు లలితా పారాయణ, స్తోత్ర పారాయణ చేశారు. మధ్యాహ్నం అమ్మవారి ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. పీఠాధిపతి శ్రీ బాలత్రిపురేంద్రస్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈ.పావని, జి.శైలజ, విజేత, కుమారి, నాగార్జునరాజు, ఈ.రాధాకృష్ణ, ఈ.సత్యదుర్గాప్రసాద్, ఎన్.రాజు, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వీసీసీ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాలు



వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

గాజువాక : వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ (వీసీసీ) ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణపై ఆ సంస్థ ప్రతినిధులు ఆదివారం వర్క్‌షాప్ నిర్వహించారు. స్థానిక స్వామి విద్యానికేతన్ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గాజువాక, మల్కాపురం ప్రాంతాలకు చెందిన పలువురు విద్యార్థులు హాజరయ్యారు. రోటరీ క్లబ్, ఆసరా చారిటబుల్ ట్రస్టు సొసైటీ సహకారంతో మే 3 నుంచి 15 రోజులపాటు విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహించనున్నట్టు వీసీసీ జిల్లా కన్వీనర్ కె.సుశీల తెలిపారు. వలంటీర్లకు ఐస్ బ్రేకింగ్ యాక్టివిటీస్, సైంటిస్ట్ గేమ్, క్లాప్, వాక్, జంప్, చెవిలోమాట, కమ్యూనిటీ గేమ్స్, నంబర్ గేమ్స్, మెమరీ గేమ్స్, టీమ్ గేమ్స్ తదితర అంశాలపై శిక్షణ నిర్వహించారు. వీసీసీ ప్రతినిధులు డాక్టర్ రమేష్‌కుమార్, అరుణ, అప్పారావు, శ్రావణి, చందన, పద్మ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి సమస్యలు పరిష్కరించాలి



టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డిని పుష్పగుచ్ఛంతో సత్కరిస్తున్న పూర్ణ

అగనంపూడి: అగనంపూడి రైతుబజార్, టోల్‌గేటు సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ఉమ్మడి విశాఖ జిల్లా వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ (పూర్ణ) కోరారు. మధురవాడలోని సుబ్బారెడ్డి క్యాంప్ కార్యాలయంలో కలిసిన పూర్ణ అగనంపూడి సమస్యలు వివరించారు. కార్యక్రమంలో నాయకులు యలమంచిలి చిన అప్పారావు, వి.వరప్రసాద్, పి.హరీష్, పి.రామకృష్ణ పాల్గొన్నారు.



వైవీ సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న దామా సుమంత్‌చౌదరి

మర్యాదపూర్వక కలయిక

కూర్మన్నపాలెం : టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని ఆంధ్రప్రదేశ్ కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ దామా సుమంత్ చౌదరి, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ఆదనపు కార్యదర్శి దామా సుబ్బారావు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. అనంతరం కమ్మ సామాజిక వర్గానికి చెందిన పలు సమస్యలపై మాట్లాడారు. వెలుగుల పరశురాముడు, చేగొండి శ్రీనివాసరావు, నిర్మల, శ్రీనివాస్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యునికి సర్వీస్ లెజెండ్ అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న శ్రీనివాసరావు

గాజువాక : వివిధ రంగాల్లో ప్రతి ఏటా సేవలందించే వారికి వరాహా వెంకటేశ్వర ఎడ్యుకేషనల్ ట్రస్టు, నేషనల్ కన్జ్యూమర్ రైట్స్ కమిషన్ ఇంటర్నేషనల్ ఇచ్చే సర్వీస్ లెజెండ్ అవార్డు ఈ ఏడాది గాజువాకకు చెందిన ఆయుర్వేద డాక్టర్ దేవరాపల్లి శ్రీనివాసరావుకు లభించింది. ఈ మేరకు జిల్లా పరిషత్ హాల్లో ఆదివారం కన్జ్యూమర్ కోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్, వి.సూర్యభాస్కరం అవార్డును శ్రీనివాసరావుకు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులు, ప్రముఖులు పాల్గొన్నారు.

నిరుపేద వృద్ధురాలికి ఆర్థిక చేయూత



సత్యవతికి ఆర్థిక సాయం, నిత్యావసరాలు అందజేస్తున్న దృశ్యం

అక్కిరెడ్డిపాలెం : స్థానిక హెల్పింగ్ హ్యాండ్ ప్రతినిధులు ఆదివారం గ్రామంలో నిరుపేద వృద్ధ మహిళ కుటుంబానికి ఆసరాగా నిలిచారు. చాలీచాలని వేతనంతో పని చేస్తున్న గేదెల సత్యవతి అనే వృద్ధురాలి కుటుంబానికి రూ.22 వేల ఆర్థిక సహాయంతో పాటు రెండు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేశారు. వీరితో పాటు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 1999–2000 సంవత్సర పూర్వ విద్యార్థులు రూ.28 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

లో వోల్టేజీ సమస్య పరిష్కరించాలని వినతి



అధికారులతో కలిసి కాలనీలో పర్యటిస్తున్న నర్సింహపాత్రుడు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని బాపూజీ కాలనీ, నేతాజీ కాలనీ, ప్రియదర్శినీ కాలనీల్లో నిత్యం లోవోల్టేజీ సమస్య వేధిస్తోందని వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు అన్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో కలిసి ఆయా ప్రాంతాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించాలంటే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని సూచించారు. కరెంట్ సరఫరాలో హెచ్చుతగ్గుల కారణంగా ఇళ్లలోని గృహోపకరణాలు మరమ్మతులకు గురవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ ఏఈ రిషికేష్, లైన్‌మేన్ సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా టేబుల్ టెన్నిస్ పోటీలు

గోపాలపట్నం: వైజాగ్ డిస్ట్రిక్ట్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఒక రోజు నిర్వహించిన టేబుల్ టెన్నిస్ పోటీలను ఎస్ఎస్‌టీఎల్ డైరెక్టర్ వై. శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు ఇలాంటి పోటీల్లో పాల్గొనడం వల్ల ఉల్లాసంగా ఉంటుందని తెలిపారు. ఎస్ఎస్‌టీఎల్ క్రీడలను ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఎస్ఎస్‌టీఎల్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఈ పోటీల్లో 16 జట్లు పాల్గొన్నాయని వీడీటీటీఏ కార్యదర్శి డాక్టర్ శర్మ తెలిపారు.

నేడు ఉక్కులో యువ కార్మికుల నిరసన

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యువ కార్మికులు సోమవారం నిరసన కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులకు నూతన వేతన ఒప్పందం అమలు కాకపోవడంతో కార్మిక సంఘాలకు అతీతంగా గత కొన్ని రోజులుగా వారు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా మేడే సందర్భంగా ఉక్కు హిల్‌టాప్ కూడలి వద్ద ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలపనున్నట్టు యువ కార్మికులు జెర్రిపోతుల మోహన్‌కుమార్, కోరాడ వెంకటరావు తెలిపారు.



పారిశుద్ధ్య కార్మికుల కృషి ఎనలేనిది

సింధియా: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల కృషి ఎనలేనిదని 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు అన్నారు. కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏకేసీ కాలనీలో జీవీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, సచివాలయ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్తిబాబు పర్యవేక్షణలో వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు చేతుల మీదుగా పారిశుద్ధ్య కార్మికులకు కొబ్బరి నూనె, సబ్బులు, గ్లౌజులు, జాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు పెంచడమే కాకుండా వారి ఆరోగ్యం దృష్ట్యా పలు సంక్షేమ పథకాలు అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు.

కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో కన్యకా పరమేశ్వరి అమ్మవారు

గాజువాక : గాజువాక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంత్యుత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు గుంపిన రఘునాథగుప్త, ఏవీఎస్ఎన్ గుప్త, గనిశెట్టి అప్పల నారాయణ గుప్త, వూడ వరహాలశెట్టి, పబ్బతి సూర్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.